అన్ని వార్డుల అభివృద్ధే లక్ష్యం

- నగర మేయర్ హరి వెంకటకుమారి
- 75వ వార్డులో రూ.4.81 కోట్లతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన



పెదగంట్యాడలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరి వెంకటకుమారి



పెంటమాంబ ఆలయం వద్ద ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. జీవీఎంసీ జోన్–6లోని 75వ వార్డు పరిధి పెదగంట్యాడ, సీతానగరం, నెల్లిముక్కు, దొమ్మేటి వీధి, నీలాపువీధి, పెంటమాంబ ఆలయం ఆవరణలో 4కోట్ల 81 లక్షల 65 వేల రూపాయలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు)తో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశాఖ నగర అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజలకు మౌలిక వసతులతో పాటు సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని వివరించారు.

కోట్ల రూపాయలతో అభివృద్ధి : ఎమ్మెల్యే నాగిరెడ్డి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గాజువాక నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తెలిపారు. రానున్న రోజుల్లో గాజువాక అభివృద్ధికి మరిన్ని నిధులు తెప్పించి ప్రతి వార్డును మోడల్ వార్డుగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బంటు సన్యాసినాయుడు, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, నాయకులు గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, మార్టుపూడి పరదేశి, గొందేశి వెంకటరమణారెడ్డి, గొందేశి మహేశ్వరరెడ్డి, పులి వెంకట రమణారెడ్డి, గొందేశి ప్రభాకర్‌రెడ్డి, వెంకటేష్, పులి రాజారెడ్డి, వంశీకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చేపట్టనున్న పనులు

- 75వ వార్డు పరిధిలోని పెదగంట్యాడలో రూ.3 కోట్ల 27 లక్షల 50 వేలతో బరియల్ గ్రౌండ్‌లో బర్నింగ్ ప్లాట్‌ఫాం, మౌలిక సదు పాయాలు, విద్యుత్, ఎస్‌డబ్ల్యూ కాల్వలు కార్యాలయపు గది నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు.
- రూ.39.30 లక్షలతో సీతానగరం, దొమ్మేటి వీధి, నీలాపు వీధిలో పార్కుల్లో ఓపెన్ జిమ్, పిల్లల ఆట వస్తువుల ఏర్పాటు
- రూ.20 లక్షలతో నెల్లిముక్కు రామాలయం వద్ద మల్టీ లెవెల్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం
- రూ.35లక్షలతో సీతానగరం రామాలయం వద్ద కల్యాణ మండపం నిర్మాణం
- రూ.40 లక్షలతో పెంటమాంబ గుడి వద్ద రక్షణ గోడ
- రూ.19.99లక్షలతో పెదగంట్యాడలో సీసీ రోడ్డు నిర్మాణం

సీఎంను కలిసిన ఎమ్మెల్యే నాగిరెడ్డి



శారదాపీఠానికి విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని సీఎం ఆప్యాయంగా పలకరించి ముచ్చటించారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులను ఆయనకు వివరించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. - గాజువాక

క్లుప్తంగా

ఎయిడ్స్ నివారణపై అవగాహన



హెల్ప్ లైన్ గురించి వివరిస్తున్న కళాకారులు

గాజువాక: ఎయిడ్స్ నియంత్రణపై విశాఖ జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ప్రదర్శనలు నిర్వహించారు. యాక్సెప్ట్ సీసీ టీఐ నేతృత్వంలో తేజస్విని కళాజాత బృందం కొత్తగాజువాక జంక్షన్ వద్ద నాటికల ద్వారా ప్రచారం నిర్వహించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ వంటి ప్రాణాంతక వ్యాధులు, సుఖవ్యాధులు సంక్రమించే విధానాన్ని, వాటి నివారణకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న అంశాలను నాటికల ద్వారా వివరించారు. బాధితులు ఏఆర్‌టీ మందులను ఉపయోగించుకోవాలని, అత్యవసర సమయంలో 1097 హెల్ప్‌లైన్ సహాయం తీసుకోవాలని సూచించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌తో బాధపడుతున్న వారిపై ఎటువంటి వివక్ష చూపించొద్దని వివరిస్తూ ఈ ప్రదర్శనలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ ఎం.పోలినాయుడు, ఢిల్లీశ్వరి, జయమ్మ, కృష్ణవేణి, రషీత, లక్ష్మి, అప్పారావు, కళాజాత కో–ఆర్డినేటర్ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగ్‌ల పంపిణీ



విద్యార్థులతో ఫౌండేషన్ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడక ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులకు నాంది ఫౌండేషన్ ప్రతినిధులు బ్యాగ్‌లు, రెయిన్ కోట్లు, నోట్ పుస్తకాలు, పెన్నులు, క్రేయాన్స్ అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ అగనంపూడి నాయకుడు యలమంచిలి అప్పారావు మాట్లాడుతూ పేద విద్యార్థులకు కొన్నేళ్లుగా సాయం చేస్తున్న నాంది ఫౌండేషన్ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కమ్యూనిటీ మొబలైజర్ యలమంచిలి లావణ్య, నాయకులు దానబాల అప్పలనాయుడు, పాఠశాల ఉపాధ్యాయులు విజయలక్ష్మి, శ్రీనివాసరావు, కమిటీ చైర్మన్ ఎ.సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ స్టీల్‌సిటీ అసిస్టెంట్ మేనేజర్ బదిలీ



రమణమూర్తిని సత్కరిస్తున్న కార్మిక సంఘాల ప్రతినిధులు

ఉక్కునగరం: ఆర్టీసీ స్టీల్ సిటీ డిపో అసిస్టెంట్ మేనేజర్ జి.రమణమూర్తి సింహాచలం డిపోకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సిటీ ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ పి. శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం డిపో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు ఆయనను సత్కరించారు. నూతన అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసరావుకి బొకే అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో డిపో అధికారులు పలువురు పాల్గొన్నారు.

24, 25 తేదీల్లో బీఎంఎస్ 4వ రాష్ట్ర మహాసభలు

అక్కిరెడ్డిపాలెం: బీఎంఎస్ 4వ రాష్ట్ర మహాసభలు ఈ నెల 24, 25 తేదీల్లో 69వ వార్డు శీలానగర్‌లోని బీవీకే స్కూల్ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు బీఎంఎస్ కార్యదర్శి శరగడం చంద్రశేఖర్ బుధవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భారతీయ మజ్దూర్ సంఘ్ అఖిల భారత అధ్యక్షులు హిరణ్మయ పాండ్యా, ఉపాధ్యక్షులు మళ్ల జగదీశ్వరరావు, దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన మంత్రి ఎస్.దురై రాజ్, ఎన్ఈసీ మెంబర్ ఆషామోల్ పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా సంఘటిత, అసంఘటిత రంగానికి చెందిన కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారన్నారు.

ఎల్ఐసీ సర్వీస్ క్యాంప్ ప్రారంభం



క్యాంప్‌లో ఉద్యోగులకు పత్రాలు అందజేస్తున్న బ్రాంచ్ మేనేజర్ కృష్ణారావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో బుధవారం జీవిత బీమా సంస్థ గాజువాక బ్రాంచ్ ఆధ్వర్యంలో పాలసీ సర్వీస్ క్యాంప్ ప్రారంభించారు. ప్లాంట్‌లోని పే సెక్షన్‌లో ఏర్పాటు చేసిన క్యాంప్‌ను సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎం.కృష్ణారావు ప్రారంభించారు. క్యాంప్‌లో మార్చి నెలాఖరుకు మెచ్యూర్ అయ్యే పాలసీలకు సంబంధించిన డాక్యుమెంట్లను స్వీకరించారు. పెండింగ్ పాలసీల గురించి ఉద్యోగులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ నాయకులు నరేష్ కుమార్, చీకటి శ్రీనివాస్ మాట్లాడుతూ తమ విజ్ఞప్తి మేరకు రెండు రోజుల పాటు క్యాంప్ ఏర్పాటు చేసిన బ్రాంచ్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం కూడా క్యాంప్ కొనసాగుతుందని, ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డివిజనల్ ఆఫీస్ మేనేజర్ జి.హైమ, ఏవో వెంకట రమణ, బ్రాంచ్ ఏఏవో ఎ.పద్మ, పి.రవీంద్రనాథ్, జి.వి.పి.ఆర్.కుమార్ రెడ్డి, ఎ.శ్రీనివాస్, ధర్మ తదితరులు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా పని చేయాలి

వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త చందు



సమావేశంలో మాట్లాడుతున్న ఉరుకూటి చందు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు

పెదగంట్యాడ: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా బూత్ లెవెల్ ఏజెంట్లు, సచివాలయ కన్వీనర్లు పని చేయాలని ఆ పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) కోరారు. జీవీఎంసీ 76వ వార్డు నడుపూరు వాసవీ జ్ఞాన మందిరంలో బీఎల్ఏలు, సచివాలయ కన్వీనర్లతో బుధవారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు జాబితాలను నిశితంగా పరిశీలించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో దొడ్డి రమణ, తాటికొండ జగదీష్, అచ్యుత్, కాకినాడ పెంటారావు, బెల్లాల పెంటిబాబు, నడుపూరు సన్యాసిరావు, చిన్నారావు, సాంబశివరావు, శరత్, గొంప రమేష్ తదితరులు పాల్గొన్నారు.

68వ వార్డు మిందిలో..

అక్కిరెడ్డిపాలెం: గాజువాకలో తిరిగి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేయాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి చందు కోరారు. 68వ వార్డు మిందిలో గుడివాడ అప్పన్న కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ బూత్ కమిటీ అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సంక్షేమానికి జగనన్న ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. అనంతరం బూత్ కమిటీ అధ్యక్షుల లిస్ట్‌ను ఉరుకూటి చందుకు అందజేశారు. కార్యక్రమంలో 68వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్, నాయకులు వరదాడ వెంకటరమణ, సంక్రాంన నూకరాజు, నంబారు రాజు, నేలపాటి సత్యవతి, గొంతిన సత్యవతి, పోలవరపు శ్రీహరి, సయ్యద్ హుస్సేన్, తెంటు గోపాలరావు పాల్గొన్నారు.

ఐద్వా సమావేశాల పోస్టర్ ఆవిష్కరణ



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ఐద్వా ప్రతినిధులు

ఉక్కునగరం: ఐద్వా జాతీయ కార్యవర్గ సమావేశాలు జయప్రదం చేయాలని ఐద్వా స్టీల్ డివిజన్ నాయకులు కోరారు. ఉక్కునగరంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఐద్వా సమావేశాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ మహిళలపై పెరుగుతున్న హింస, పరిశ్రమల ప్రైవేటీకరణ ప్రభావం, నిత్యావసర ధరల పెరుగుదల తదితర అంశాలపై ఈ నెల 22 నుంచి 25 వరకు విశాఖలో జరిగే కార్యవర్గ సమావేశాల్లో విస్తృతంగా చర్చించనున్నారన్నారు. కార్యక్రమంలో స్టీల్ జోన్ కార్యదర్శి కె.వేణు, కార్యవర్గ సభ్యులు జి.పుష్ప, వి.సుమలత, ఎ.సూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మ్యాజిక్ సదస్సులో విజయకుమార్‌కు మెడల్



మెడల్ అందుకుంటున్న విజయకుమార్

ఉక్కునగరం: జాతీయ మ్యాజిక్ సదస్సులో స్టీల్‌ప్లాంట్ విశ్రాంత అధికారి కె.విజయకుమార్‌కు మెడల్ లభించింది. ఈ నెల 18న చెన్నైలో టీచ్ ఆడిటోరియంలో మేజికా–2024 పేరిట జాతీయ మ్యాజిక్ సదస్సు నిర్వహించారు. సదస్సులో దేశవ్యాప్తంగా 150 మంది మెజీషియన్లు పాల్గొన్నారు. సదస్సులో భాగంగా అబ్దుల్ కలాం వరల్డ్ రికార్డ్ పేరిట ఈవెంట్ నిర్వహించారు. అందులో 60 మంది మెజీషియన్లు వరల్డ్ రికార్డ్ కోసం తమ ప్రదర్శనలు అందించారు. అందులో విజయకుమార్ ప్రదర్శనకు ప్రత్యేక మెడల్ లభించింది. ఈ సందర్భంగా విజయకుమార్‌ను ఉక్కు ఉద్యోగులు పలువురు అభినందించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అక్కిరెడ్డిపాలెం: 11 కేవీ బీహెచ్‌పీవీ – శీలానగర్, 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్లలో మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్కిరెడ్డిపాలెం మొత్తం ప్రాంతం, వికాస్ కాలేజ్ ప్రాంతం, వివేకానంద కాలనీ, ఏషియన్ పెయింట్ ఏరియా, పంచవటి టౌన్ షిప్‌లలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు.

వడ్లపూడి ఫీడర్ పరిధిలో..

కూర్మన్నపాలెం: వడ్లపూడి విద్యుత్ సబ్ స్టేషన్లలోని 33/11 కేవీ ఫీడర్‌లో మెయింటెనెన్స్ పనులను చేపట్టనున్న దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బి.కె.నాయుడు తెలిపారు. ముఖ్యంగా వడ్లపూడి, తిరుమలనగర్, ఈ–బ్లాక్ ఇండస్ట్రియల్ ఏరియా, అపెరల్ పార్కు తదితర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేసున్నట్లు ప్రకటించారు.

భక్తాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



భీష్మ ఏకాదశి సందర్భంగా పూజలు చేస్తున్న భక్తులు

అగనంపూడి: భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని 85వ వార్డు కొండయ్యవలస భక్తాంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా పూజలు చేశారు. ఏకాదశి పర్వదినం సందర్భంగా మంగళవారం ప్రారంభమైన పూజలు బుధవారం ఉదయంతో ముగిశాయి. అగనంపూడి, పరిసర నిర్వాసిత కాలనీల భక్తులు పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం విశేష అన్న సమారాధన చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, యూనియన్ బ్యాంక్ మేనేజర్ శ్యామ్ ప్రసాద్, బలిరెడ్డి శ్రీను, సత్యనారాయణ, కొండయ్యవలస శ్రీహనుమాన్ ఆదర్శ యువజన సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రజాపోరు యాత్ర ప్రారంభం

గాజువాక: గాజువాకలో బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాపోరు యాత్రను ఆ పార్టీ గాజువాక కోఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించడం కోసం ప్రజాపోరు యాత్ర ప్రారంభించినట్టు తెలిపారు. ఈ యాత్ర నియోజకవర్గంలో తొమ్మిది రోజులపాటు కొనసాగుతు దన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గూటూరు శంకరరావు, బొండా ఎల్లాజీరావు, రోహిణి, కట్టా పద్మ, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యతతోనే పేదరిక నిర్మూలన



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జాన్సన్

పెదగంట్యాడ: పేదరికాన్ని నిర్మూలించాలంటే ప్రతి ఒక్కరూ చదువుకోవాలని ఆర్‌డబ్ల్యూఎల్ రిసోర్స్ పర్సన్ జాన్సన్ అన్నారు. లే పీపుల్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ (లీడ్స్) ఆధ్వర్యంలో వికాస్‌నగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో వయోజన విద్యపై బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంపూర్ణ అక్షరాస్యత సాధించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లోని 40 గ్రామాల్లో వయోజన విద్యా కార్యక్రమం ద్వారా నిరక్షరాసులకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. పాస్టర్ రవికుమార్ మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమంలో భాగంగా పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందజేస్తామన్నారు. సంస్థ డైరెక్టర్ సీహెచ్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

- చేరువలోనే వైద్య నిపుణులతో సేవలు
- 66, 74 వార్డుల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు



సిద్ధేశ్వరం పీహెచ్‌సీ వద్ద శిబిరంలో మాట్లాడుతున్న డీఐవో జీవన్‌రాణి



రోగిని పరీక్షిస్తున్న యూపీహెచ్‌సీ వైద్యాధికారి మానస



కంటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది



నవాబ్‌నగర్‌లో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

పెదగంట్యాడ: ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఐవో జీవన్ రాణి సూచించారు. జీవీఎంసీ 74వ వార్డు దయాల్ నగర్–4 సచివాలయం పరిధి సిద్ధేశ్వరం పీహెచ్‌సీ వద్ద వైద్యాధికారి డాక్టర్ మానస ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య బృందం నేరుగా గ్రామాలకే వచ్చి రోగులను పరీక్షించి కావలసిన మందులు అందజేస్తోందన్నారు. ఈ సేవలు వినియోగించుకోవాలని కోరారు.

495మందికి వైద్య సేవలు

శిబిరంలో 495 మందికి నలుగురు వైద్యులు సేవలు అందించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి మానస, డాక్టర్ ఉమారాణి, డాక్టర్ ఎ.పావని, డాక్టర్ చైతన్య వర్మ వైద్య పరీక్షలుచేశారు. అవసరమైన వారికి శిబిరంలో రక్త పరీక్షలు, బీపీ, షుగర్, గుండెకు సంబంధించిన పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నవాబ్ నగర్‌లో 372 మందికి ..

గాజువాక: 66వ వార్డు నవాబ్‌నగర్‌లో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష–2 శిబిరంలో వైద్యాధికారులు 372 మందికి సేవలను అందించారు. ఒక్కొక్కరికి మూడు, నాలుగు వైద్య పరీక్షల చొప్పున మొత్తం 1200 మందికి వైద్య పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. నలుగురు రోగులను రిఫరల్ ఆస్పత్రికి పంపించారు. కార్యక్రమాన్ని డీఐవో డాక్టర్ జీవనరాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఉమావతి, డాక్టర్ ఫెల్వియా మౌనిక తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేట్లకు కొమ్ము కాస్తున్న కేంద్రం'



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమకు ముడిసరకును అందించి పూర్తి స్థాయి ఉత్పత్తి దిశగా సంస్థను నడపాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో 1105వ రోజు, బుధవారం సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్లాంట్‌ను ఆపేయాలనే ఆలోచనతో ముడిసరకు అందించకుండా ఇప్పటికే పలు ముఖ్య విభాగాలను ప్రైవేట్ వ్యక్తుల చేతికి అందించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ముడి సరకు అందించకుండా, కార్మికులకు పని లేకుండా చేస్తున్నారన్నారు. ఇదంతా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రైవేటీకరణ కుట్రలో భాగమేనన్నారు. దీనికి యాజమాన్యం కూడా సహకరించడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్పొరేట్లకు కొమ్ము కాయడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీరు మార్చుకోవాలని, ప్రజా ఉద్యమాలకు విలువ ఇస్తూ ప్రజలకు అండగా ఉండాలని కోరారు. లేకుంటే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

పాఠశాలలో పరిశుభ్రత కార్యక్రమం



పాఠశాల పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు చుక్కవానిపాలెం ప్రాథమిక పాఠశాల పరిసరాల్లో గాజువాక ఆదిత్య కళాశాల విద్యార్థులు పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. కళాశాల ఎన్ఎస్ఎస్ క్యాంప్‌లో భాగంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా కళాశాల విద్యార్థులు తుంగ్లాంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కౌన్సెలింగ్ చేశారు. నిత్యం పాఠశాలకు రావాలని, పరిశుభ్రత పాటించాలని, ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా వినాలని.. తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ తిరుపతిరావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాసరావు, పాత్రుడు, మూర్తి, తుంగ్లాం గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మాతృభాషను గౌరవించాలి



మాట్లాడుతున్న విజ్ఞాన్ వైస్ ప్రిన్సిపాల్ రవీంద్ర

అగనంపూడి: మాతృభాష గొప్పదనం చాటిచెప్పిన భాషాభిమానులను ఆదర్శంగా తీసుకుని వారి అడుగుజాడల్లో నడవాలని దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రవీంద్ర అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసం, పోస్టర్ ప్రదర్శన, కవితల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృభాషను తల్లితో సమానంగా గౌరవించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, కళాశాల డీన్ బి.సతీష్, ప్రిన్సిపాల్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు భక్తిశ్రద్ధలతో నిత్య కల్యాణం



స్వామివారికి యజ్ఞోపవీత ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్య కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది.